క్లుప్తంగా

8న మండల సమావేశం

వరికుంటపాడు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 8న ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో జరుగుతుందని ఎంపీడీఓ చేవూరి శ్రీదేవి శుక్రవారం తెలిపారు. ఎంపీపీ గవదగట్ల వెంకటలక్ష్మమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో మండలంలో శాఖల వారీగా జరిగిన అభివృద్ధిపై సమీక్షిస్తారన్నారు. సమావేశానికి అధికారులు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు సర్పంచ్‌లు, కో–ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొనాలన్నారు.

అచీవ్‌మెంట్ సర్వే పరీక్షలు



పరీక్షను పర్యవేక్షిస్తున్న ఎంఈఓ మస్తాన్‌వలి

ఉదయగిరి: మండలంలో ఎంపిక చేసిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్ష ముగిసింది. మండలంలో 3, 6, 9 తరగతులకు సంబంధించి 767 మంది విద్యార్థులకు 716 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఈ పరీక్షను ఎంఈఓలు షేక్ మస్తాన్‌వలి, తోట శ్రీనివాసులు పర్యవేక్షించారు.
వరికుంటపాడు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం నిర్వహించిన స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మండలంలో విద్యాశాఖ ఎంపిక చేసిన 16 ప్రభుత్వ పాఠశాలల్లో 380 మందిని గుర్తించగా సర్వే పరీక్షకు 300 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పరీక్షలను ఎంఈఓలు షావుద్దీన్, సీహెచ్ రమణయ్య పర్యవేక్షించారు. ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్స్‌గా ఉదయగిరి మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ కళాశాలకు చెందిన 22 మంది డిగ్రీ విద్యార్థులు వ్యవహరించారు.
సోమశిల: అనంతసాగరం మండలంలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలలో విద్యార్థులకు ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ పరీక్షలు శుక్రవారం నిర్వహించారు. కాటంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పలు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. విద్యార్థులు రాసిన పరీక్ష ప్రశ్నపత్రాలు మార్కులను త్వరలోనే తెలుపుతామని ఎంఈఓ తెలిపారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా వెంకటస్వామి



నియామకపత్రం అందుకుంటున్న వెంకటస్వామి

ఉదయగిరి: బీజేపీ ఉదయగిరి మండల అధ్యక్షుడిగా మండలంలోని గన్నేపల్లి పంచాయతీ సర్పంచ్ నెల్లూరు వెంకటస్వామిని నియమించారు. ఈ మేరకు శుక్రవారం నెల్లూరు బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. అనంతరం వెంకటస్వామి మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో నాపై పెట్టిన బాధ్యతలను విస్మరించకుండా పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

పంటల సాగులో మెలకువలు పాటించాలి

వరికుంటపాడు: పంటలు సాగు చేసే రైతులు వ్యవసాయ నిపుణుల సూచనలు, సలహాలు పాటిస్తూ సాగులో మెళకువలు పాటించాలని ఏఓ వి.రవికుమార్ అన్నారు. ఆయన శుక్రవారం మండలంలోని డక్కునూరులో సాగులో ఉన్న మినుము పంటను పరిశీలించి రైతులకు సలహాలు అందించారు. ఇటీవల కురిసిన వర్షాలకు మినుము పంటకు ఏమి ఇబ్బంది లేదని బాగుందన్నారు. సాగులో ఉన్న వరిలో ఆకు ముడత తెగులు ఉందని నివారణా చర్యలు పాటించాలన్నారు. శనగ విత్తనాలకు మండలంలో ఇప్పటికి 200 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. వరికుంటపాడు, విరువూరు ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్ల జాబితాలు ప్రదర్శించామన్నారు. ఈ నెల 7న రైతుభరోసా నగదు రైతుల ఖాతాల్లో జమవుతుందన్నారు. మండలంలో 6,552 మంది రైతులకు రూ.1.31 కోట్ల లబ్ధి చేకూరనుందన్నారు.

ఘనంగా అలి ఔలియా దర్గా 25వ గంధమహోత్సవం

మర్రిపాడు: మండలంలోని ఖాన్‌సాహెబ్‌పేటలోని అలి ఔలియా దర్గా గంధమహోత్సవం శుక్రవారం రాత్రి అట్టహాసంగా ప్రారంభమైంది. దర్గా పీఠాధిపతి బందా నవాజ్ బాబా (గోపిదేశి హజరత్తయ్య) నివాసం నుంచి విశేషంగా అలంకరించిన పీర్లు, ఖవ్వాలి పాటలు, బ్యాండ్ మేళాలు, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. శనివారం తెల్లవారుజామున గంధమహోత్సవం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

కిలో ఉల్లి రూ. 40

కావలి: పట్టణంలోని రైతు బజార్‌లో శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి కిలో ఉల్లి రూ. 40లకే అమ్మకాలు చేయనున్నట్లు రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ డీ స్వరూపరాణి చెప్పారు. ఈ అవకాశాన్ని కావలి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బోరుకు మరమ్మతులు

కావలి: పట్టణంలో 10వ వార్డులో పాడైపోయిన బోరును శుక్రవారం మరమ్మతులు చేసి ప్రజలకు నీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ చెప్పారు. పట్టణంలో బోర్లు మరమ్మతులకు గురై ఉంటే ప్రజలు దగ్గరలోని వార్డు సచివాలయంలో తెలియజేయాలని కమిషనర్ చెప్పారు.

ప్రతి కుటుంబ ఆర్థికాభివృద్ధికి జగనన్న ప్రణాళికలు

- మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుందాం
- త్వరలో సామాజిక సాధికార బస్సు యాత్ర
- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

సోమశిల: ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవసరమైన సంక్షేమ పథకాలను అందిస్తున్నారని, అందు కోసం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తూ ముందుకు సాగుతున్నారని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం అనంతసాగరం మండలం లింగంగుంట సచివాలయం పరిధిలోని బెడుసుపల్లి, లింగంగుంట గ్రామాల్లో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లిన ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి అందజేసిన సంక్షేమ అభివృద్ధి పథకాలను వివరిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తెలిపిన సమస్యలను అధికారులకు తెలిపి సత్వరం పరిష్కరించాలన్నారు. ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 82 సచివాలయాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా పర్యటించానన్నారు. ముఖ్యమంత్రి అందజేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందాయా లేదా పరిశీలించడంతో పాటు సమస్యలు, అభివృద్ధి పనుల గురించి తెలుసుకున్నామన్నారు. ప్రజలు తెలిపిన సమస్యలను అధికారులకు తెలిపి సత్వరం పరిష్కరించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకు వచ్చిందని, భూమి లేని ప్రతి ఒక్కరికీ భూములు అందజేయాలనే ఉద్దేశంతో సమీక్ష సమావేశాలు నిర్వహించిందన్నారు. మూడు నెలలుగా కలెక్టర్ నుంచి మండల స్థాయి అధికారులు ఈ విషయమై చర్యలు తీసుకుంటున్నారన్నారు. నియోజకవర్గంలో రెవెన్యూ సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ నెల 7న మళ్లీ కలెక్టర్‌తో సమావేశం నిర్వహిస్తున్నామని, ఇందులో ప్రధానంగా ఆత్మకూరు నియోజకవర్గంలో ఇంటి స్థలాలు, భూములు లేని వారికి వాటిని అందజేసేలా కలెక్టర్‌కు వివరించనున్నట్లు తెలిపారు. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ విద్యను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బలోపేతం చేశారని, 14 శాతం విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరారన్నారు. మహిళలకు అనేక రకాల పథకాలను అందజేసి వారిని ఆర్థికంగా అభివృద్ధి చేస్తున్నారని వివరించారు. పించను కోసం ఎవరి దగ్గరకు వెళ్లకుండా అర్హతే ప్రమాణికంగా అందజేస్తున్నారని, ఇలాంటి మార్పులతో మన రాష్ట్రం నంబర్ వన్ స్థానంలో నిలుస్తోందన్నారు.

త్వరలో సామాజిక బస్సు యాత్ర

ఆత్మకూరు నియోజకవర్గంలో త్వరలో సామాజిక సాధికార బస్సు యాత్ర జరగనుందని, ఈ యాత్రలో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అందరి సంక్షేమం కోసం శ్రమిస్తున్న జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని, 175కు 175 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బోయపాటి లక్ష్మీదేవి, ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, ఎంపీడీఓ ఏ మధుసూదన్‌రావు, తహసీల్దారు సుభాషిణి, సచివాలయ మండల కన్వీనర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి, పాతాళపల్లి సర్పంచ్ బిజివేముల ఓబులరెడ్డి, అనంతసాగరం సహకార సంఘం అధ్యక్షుడు కేతా రామకృష్ణారెడ్డి, చేజర్ల జెడ్పీటీసీ పేర్ల పార్థసారధి, ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కేతా రాఘవరెడ్డి, నాగిరెడ్డి, అంబటి కృష్ణారెడ్డి, వెంకట కృష్ణారెడ్డి బట్రెడ్డి నాగేంద్రరెడ్డి, నాగార్జునరెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఆర్ ప్రభాకర్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, ఏసోద కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ గోడౌన్‌ను డీసీఓ పరిశీలన



వెన్నవాడలో సొసైటీ గోడౌన్‌ను పరిశీలిస్తున్న జిల్లా సహకార శాఖ అధికారి సుధాభారతి

ఆత్మకూరురూరల్: మండలంలోని వెన్నవాడ సొసైటీ పరిధిలో నిర్మించిన సహకార శాఖ గోడౌన్‌ను జిల్లా సహకార శాఖ అధికారి సుధాభారతి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు సొసైటీ ద్వారా అందిస్తున్న ప్రోత్సాహకాలు, సేవలను ఆమె అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతుల ఉత్పత్తుల నిల్వలతో పాటు విక్రయాలలో సొసైటీ ద్వారా తమ వంతు సహకారం అందించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆత్మకూరు సబ్ డివిజన్ కో–ఆపరేటివ్ అధికారి మల్లికార్జున, సొసైటీ కార్యదర్శి ఇంటూరి సురేష్‌బాబు, రైతు నాయకులు పర్వతరెడ్డి మధుసూదన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి

బిట్రగుంట: అసాధారణ వాతావరణ పరిస్థితుల కారణంగా వర్షాలు జాప్యం అవుతుండడంతో రైతులు వరి పంట స్థానంలో ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని జిల్లా వనరుల కేంద్రం అధికారులు లక్ష్మీమాధవి, చక్రవర్తి, గీతాకుమారి కోరారు. బోగోలు–1, బోగోలు–2, నాగులవరం, కోవూరుపల్లి రైతు భరోసా కేంద్రాల పరిధిలోని రైతులకు వరి సాగు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగుపై శుక్రవారం అవగాహనా సదస్సులు నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ లక్ష్మీ మాధవి మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు ఆలస్యం అవుతున్న నేపథ్యంలో రైతులు వరిసాగు బదులుగా ప్రత్యామ్నాయ పంటలైన వేరుశనగ, పత్తి, పెసర, మినుము, నువ్వుల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. ఆరు తడి పంటలు సాగు చేస్తూ భూసారాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రైతులు తొందరపడి వరి సాగు కోసం నార్లు పోసుకోవద్దని సూచించారు. బోర్లు కింద నీటి సౌకర్యం కలిగిన రైతులకు వరి యాజమాన్య పద్ధతులు, నారుమడుల నిర్వహణ, ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ పద్ధతులపై అవగాహన కలిగించారు.

కంటి చికిత్స శిబిరం నేడు ముగింపు



శంకర నేత్రాలయ సర్జికల్ యూనిట్ వాహనాల్లో కంటి ఆపరేషన్లు చేయించుకున్న వారు

ఆత్మకూరురూరల్: మండలంలోని మహిమలూరులో రక్షణ శాఖ సలహాదారు డాక్టర్ గుండ్రా సతీష్‌రెడ్డి దాతృత్వంతో నిర్వహిస్తున్న శంకర నేత్రాలయ ఉచిత కంటి పొర చికిత్సా శిబిరం శనివారంతో ముగుస్తుందని నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. అయితే కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసిన వారికి ఆపరేషన్లు పూర్తయ్యే వరకు ఈ కార్యక్రమం కొనసాగిస్తామన్నారు. గత నెల 29న ప్రారంభమైన వైద్యశిబిరంలో ఇప్పటి వరకు 758 మంది రోగులను పరీక్షించగా 162 మందికి కంటి ఆపరేషన్లు చేసేందుకు వైద్యులు సిఫారస్సు చేశారన్నారు. వీరిలో 78 మందికి ఇప్పటికే శంకర నేత్రాలయ సర్జికల్ యూనిట్ బస్సుల్లో కంటి పొర ఆపరేషన్లు పూర్తయ్యాయన్నారు. కంటి వైద్య పరీక్షలు చేయించుకోవాలనుకునే వారు శనివారం 2 గంటల్లోగా శిబిరానికి హాజరుకావాలని కోరారు.

డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సుబ్బలక్ష్మమ్మ

ఉదయగిరి: పట్టణంలోని మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఆల్ఫా మెరైన్ కొడక్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ సుబ్బలక్ష్మమ్మ మాట్లాడుతూ ఉన్నత విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న ప్రతి విద్యార్థి ఏదో ఒక రంగంలో ఉద్యోగం చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. అందులో భాగంగానే ఇలాంటి జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాబ్‌మేళాకు 45 మంది విద్యార్థులు హాజరు కాగా 20 మందిని కంపెనీ ప్రతినిధులు ప్రాథమికంగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఆకుల నరసింహులు, ప్లేస్‌మెంట్ అధికారి వెంకటేశ్వరరావు, కంపెనీ ప్రతినిధులు శ్రీనివాసరావు, రేని, రాజు, అధ్యాపకులు ఎస్‌ఈఎస్ నాగేంద్రప్రసాద్, విక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ యోజన వరం



లబ్ధిదారులను నమోదు చేస్తున్న యువమోర్చా నేతలు

జలదంకి: 18 రకాల సంప్రదాయ చేతి వృత్తులు చేస్తున్న వారిలో వృత్తిలో నైపుణ్యాన్ని పెంచి ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం ప్రవేశ పెట్టిందని యువమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్డే శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక బస్టాండ్ సెంటర్లో ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా ఉచిత నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని వడ్రంగులు, స్వర్ణకారులు, కమ్మరి, తాపీ మేస్త్రీలు, టైలర్లు, బొమ్మల తయారీదారులు, చాకలి, మంగలి, బుట్టలు తయారీదారులు తదితర 18 రకాల చేతివృత్తుల వారు ఈ పథకానికి అర్హులన్నారు. ఈ పథకం ద్వారా ఎటువంటి గ్యారెంటీ లేకుండా రూ.3 లక్షల వరకు రుణం పొందవచ్చని తెలిపారు. ఇందులో ప్రతి లబ్ధిదారుడికి ఐదు రోజుల పాటు శిక్షణ ఇస్తూ రోజుకు రూ. 500 స్టైఫండ్ అందిస్తారన్నారు. వృత్తులకు సంబంధించిన టూల్‌కిట్‌లు కొనుగోలు చేయడానికి ప్రోత్సాహకంగా రూ. 15 వేలు గ్రాంట్ అందిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడు వంటేరు రాకేష్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కమతం బాలకోటయ్య, శనివరపు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేస్తున్న వలంటీర్

సోమశిల: అనంతసాగరం మండలం ఇస్కపల్లికి చెందిన శానంపూడి నరసమ్మ పింఛన్ లబ్ధిదారు. ఆమె అగ్ని ప్రమాదానికి గురై నెల్లూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. దీంతో వలంటీర్ సురేష్ శుక్రవారం ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేశారు.

అక్రమంగా విద్యుత్ వినియోగిస్తే చర్యలు



విద్యుత్ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న డీపీఈ ఎస్ఈ శ్రీనివాసుబాబు

అల్లూరు: అక్రమంగా విద్యుత్‌ను వినియోగిస్తే చర్యలు తప్పవని డీపీఈ ఎస్ఈ శ్రీనివాసు బాబు అన్నారు. శుక్రవారం అల్లూరులో విద్యుత్ వినియోగంపై తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగానికి తగిన అనుమతులు తీసుకోవాలన్నారు. తనిఖీల్లో భాగంగా 6 మాల్ ప్రాక్టీస్ కేసులు, 42 అధికలోడు కేసులు నమోదు చేశామన్నారు. ఏ కేటగిరీకి సంబంధించిన అనుమతులు ఉంటే అందులోనే వాడుకోవాలని, అధిక లోడుకు ముందుగా దరావత్తులు చెల్లించి వాడుకోవాలని సూచించారు. ఈ తనిఖీల్లో ఈఈలు జగదీష్‌రెడ్డి, సుధాకర్ అల్లూరు ఏఈ షేక్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.


వైద్య ఖర్చులకు జీఎంకే ట్రస్ట్ ఆర్థిక సాయం



రమణమ్మకు ఆర్థిక సాయం అందిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

ఉదయగిరి: మండలంలోని వెంగళరావునగర్ బెస్తకాలనీకి చెందిన గువ్వల రమణమ్మ అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని వైస్ ఎంపీపీ, జీఎంకే ట్రస్ట్ అధినేత గుంటుపల్లి మాలకొండయ్య చౌదరి దృష్టి వచ్చింది. దీంతో ఆయన శుక్రవారం తన ట్రస్ట్ ప్రతినిధుల ద్వారా రూ.10 వేలు నగదును ఆర్థికసాయంగా అందించారు. ట్రస్ట్ ప్రతినిధులు బి.వెంకటేశ్వర్లు, ఎస్కే గఫూర్, షేక్ జానీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

దోమలు నివారణ చర్యలు



ఫాగింగ్ చేస్తున్న పారిశుధ్య కార్మికులు

కావలి: పట్టణంలో 10, 11, 12 వార్డుల్లో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సూచనలు మేరకు దోమల నివారణకు చర్యలు తీసుకున్నట్లు కావలి మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. పట్టణంలో ఫాగింగ్‌ను విస్తృతంగా చేసి దోమల బెడద లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మహిళ ప్రాణాలు కాపాడిన ఎమ్మెల్యే



అపస్మారక స్థితిలో ఉన్న మహిళను ఎమ్మెల్యే కారులో ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

కావలి: అపస్మారక స్థితిలో ఉన్న మహిళను కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మానవత్వంతో హుటాహుటిన ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ ఘటన శుక్రవారం జరిగింది. అనారోగ్య కారణాలతో తీవ్ర అస్వస్థతకు గురై రోడ్డు పక్కన అపస్మారక స్థితిలో పడిపోయింది. మండలంలోని మద్దూరుపాడులో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై తిరిగి వస్తుండగా కావలి సమీపంలో హైవే పక్కన ఓ మహిళ అపస్మారక స్థితిలో పడిపోయి ఉండడాన్ని గమనించారు. వెంటనే తన కారును నిలిపి మహిళను ఆస్పత్రికి తరలించేందుకు చర్యలు చేపట్టారు. మహిళ పరిస్థితి కొంత ఆందోళనకరంగా ఉన్నట్లు అనిపించడంతో వెంటనే తన వాహనంలోనే కావలి ఏరియా ఆస్పత్రికి తరలించి అత్యవసర చికిత్స అందించే ఏర్పాట్లు చేశారు. సకాలంలో ఆస్పత్రికి తీసుకువచ్చి వైద్య సేవలు అందించడంతో మహిళకు ప్రాణాపాయం తప్పినట్లు వైద్యులు తెలిపారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆన్‌లైన్ వేదికగా ప్రజలు ఎమ్మెల్యేకు ప్రశంసలు కురిపిస్తున్నారు.

యువకుడి బలవన్మరణానికి బాధ్యులు ఎవరు?



ఆత్మకూరులో వినయ్ మృతిపై పూర్తిస్థాయి విచారణ చేయాలని డిమాండ్ చేస్తూ కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న అయ్యప్ప స్వాములు



కానిస్టేబుల్ ఎదురుగా షబ్బీర్ అనే వ్యక్తి అయ్యప్ప స్వామి దీక్షలో ఉన్న వినయ్‌ని కొడుతున్న దృశ్యం

- పోలీసులా.. నిందారోపణ చేసి దాడి చేసిన వారేనా
- కేసు నమోదులో పోలీసుల తాత్సారం

ఆత్మకూరు: పట్టణంలో తన పిన్ని వద్ద ఉంటూ మెకానిక్ దుకాణంలో పని చేస్తున్న రౌతు వినయ్ గత నెల 26న బలవన్మరణానికి పాల్పడిన ఘటనకు బాధ్యులు ఎవరనే ప్రశ్నలు పట్టణ సంధిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు ఇంత వరకు కేసు నమోదు చేయకపోవడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ ఘటనకు పోలీసులా.. నిందారోపణలు చేసి దాడి చేసిన వారా? అందుకే పోలీసులు కేసు నమోదు చేయకుండా కుంటిసాకులు చెబుతున్నారా? అని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. పోలీసులు సకాలంలో స్పందించి ఉంటే యువకుడి నిండు ప్రాణం బలై ఉండేవి కాదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వృత్తి రీత్యా బుచ్చిరెడ్డిపాళెంలో తల్లిదండ్రులు నివశిస్తున్నారు. వినయ్ ఆత్మకూరులోని తన పిన్ని సుమతి వద్ద ఉంటూ ఆర్టీసీ డిపో వద్ద ఉన్న దుకాణంలో మెకానిక్‌గా పని చేస్తున్నాడు. ఎదురు దుకాణంలోని బైక్ వైర్లు మెకానిక్ షెడ్డు పక్కన పెడితే వాటిని వినయ్ అపహరిస్తున్నాడని ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులు స్పందించలేదు. మరుసటి రోజు బైక్ యజమానితో పాటు పలువురు గుంపుగా వినయ్ పనిచేస్తున్న మెకానిక్ షెడ్డుపై దాడికి పాల్పడి వినయ్‌ని అతని మిత్రుడిని దారుణంగా కొట్టారు. అదే సమయంలో అక్కడే ఉన్న ఇద్దరు కానిస్టేబుళ్లు, కఠినంగా వ్యవహరించకపోగా దెబ్బలు తిన్న బాధిత యువకుడిని కానిస్టేబుల్ చెంపపై కొట్టడాన్ని పలువురు ఆక్షేపిస్తున్నాడు. అయ్యప్ప స్వామి దీక్షలో ఉన్న వినయ్‌పై షబ్బీర్‌తో పాటు పలువురు పోలీసుల ఎదుటే దారుణంగా కొడుతున్నా అడ్డు పడకపోవడం, మెకానిక్ షెడ్డు షటర్ వేయించి వినయ్‌ని, అతని మిత్రుడిని స్టేషన్‌కు తీసుకెళ్లారు. అక్కడ సైతం విచారణలో భాగంగా వారినే బాధించారని సమాచారం. దీంతో తీవ్ర మనస్థాపానికి గురై తల్లిదండ్రులు ఉంటున్న బుచ్చిరెడ్డిపాళెంకు వెళ్లి గత నెల 26న ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని రాసిన ఉత్తరం, అతనిపై దాడికి పాల్పడిన వీడియోలు ఆ తర్వాత వెలుగులోకి వచ్చాయి. కుటుంబ సభ్యులు ఆత్మకూరు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే ఉరి వేసుకున్నది బుచ్చిరెడ్డిపాళెంలో కాబట్టి అక్కడ ఫిర్యాదు చేయాలని సలహా ఇచ్చారు. బుచ్చిరెడ్డిపాళెంలో ఫిర్యాదు చేస్తే ఉరివేసుకుని మృతి చెందిన అనంతరం అంత్యక్రియలు అతని సొంత గ్రామం జలదంకిలో జరిగాయని, అక్కడ ఫిర్యాదు చేయాలని సలహా ఇచ్చారని కుటుంబ సభ్యులు వాపోయారు. రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వం ఏర్పడ్డాక ఎక్కడ అన్యాయం జరిగినా పోలీసులకు ఫిర్యాదు చేస్తే జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని జీఓ ఉన్నప్పటికీ ఆ దిశగా పోలీసులు స్పందించకపోవడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు సకాలంలో స్పందించి ఉంటే యువకుడి నిండు ప్రాణం బలై ఉండేది కాదని పట్టణ వాసులు పేర్కొంటున్నారు. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా ఘటన జరిగిన రోజునే కౌన్సెలింగ్ ఇచ్చామని చెబుతున్నారు.

అయ్యప్ప స్వాముల నిరసన

అయ్యప్పస్వామి దీక్షలో ఉన్న రౌతు వినయ్‌పై పలువురు దాడికి పాల్పడి దారుణంగా కొట్టడం సహించరాని విషయమని, పోలీసులు సైతం ఉదాసీనంగా వ్యవహరించడం ఏమిటని ఆత్మకూరు పట్టణ అయ్యప్ప స్వాములు ప్రశ్నిస్తున్నారు. వినయ్ మృతికి సంతాపంగా శుక్రవారం రాత్రి పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పోలీసులు కేసులు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేయాలని, లేకపోతే జిల్లా వ్యాప్తంగా ఉద్యమం నిర్వహించనన్నట్లు పట్టణ అయ్యప్ప స్వాముల సంఘం పేర్కొంది.

ఎమ్మెల్యేని సత్కరించిన రెడ్‌క్రాస్ ప్రతినిధులు



ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డిని సత్కరిస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు

కావలి: ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని కావలి రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రం ప్రతినిధులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. కావలి రక్తనిధి కేంద్రంలో ఆధునిక సౌకర్యాలు కల్పించడం, కాంపొనెంట్ బ్లాక్‌లో ఆధునిక యంత్ర పరికరాలు సమకూర్చడం, డిజిటలైజ్ చేయడంలో ఎమ్మెల్యే సహాయ సహకారాలకు కృతజ్ఞతగా రెడ్‌క్రాస్ ప్రతినిధులు ఎమ్మెల్యేని ఆయన నివాసంలో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కావలి రెడ్‌క్రాస్ బాధ్యులు డాకారపు రవిప్రకాష్, గంధం ప్రసన్నాంజనేయులు, కలికి శ్రీహరి రెడ్డి, దామిశెట్టి సుధీర్‌నాయుడు, కావలి ఏఎంసీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలను అరికడదాం



బాల్య వివాహాల నిషేధానికి కృషి చేద్దామని ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్డీఓ, తదితర అధికారులు

ఆత్మకూరు: బాల్య వివాహాలతో అనర్థాలు తప్పవని, బాలికలకు వివాహాలు చేస్తే శారీరక సమస్యలతో పాటు ఆర్థిక సమస్యలు ఎదురవుతాయని ఆత్మకూరు ఆర్డీఓ కె మధులత అన్నారు. మున్సిపల్ కార్యాలయ ఎంజీఆర్ సమావేశ మందిరంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలు–అనర్థాలపై శుక్రవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ హేనా సుజన, ఆర్డీఓ మధులత, డీఎస్పీ ఎస్.కోటారెడ్డి పాల్గొన్నారు. ఆర్డీఓ మధులత మాట్లాడుతూ బాల్య వివాహాలు నిషేధ చట్టం 2006లో ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని, ఈ చట్టం అమల్లో భాగంగా ప్రతి ఒక్కరూ బాల్య వివాహాల నిరోధానికి సహకరించాలని, బాధ్యత వహించాలని ఆమె కోరారు. బాల్య వివాహాలు జరగకుండా క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు కృషి చేయాలని, సమాచారం ఉన్నతాధికారులకు తెలియజేయాలని సూచించారు. బాల్య వివాహాల నిషేధ చట్టం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. బాల్య వివాహాల నిషేధానికి అధికారులు, ఐసీడీఎస్ సిబ్బంది ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డీసీడీఓ సురేష్, ఎస్‌జీఓ శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రత్నమ్మ, నారాయణమ్మ, పలు మండలాల ఎంపీడీఓలు పాల్గొన్నారు.

4, 5 తేదీల్లో ప్రత్యేక క్యాంప్‌లు



బీఎల్‌ఓ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ మధులత

సంగం: ఈ నెల 4, 5 తేదీల్లో పోలింగ్ బూత్‌ల్లో ఎన్నికల ప్రత్యేక క్యాంపులను పకడ్బందీగా నిర్వహించాలని ఆత్మకూరు ఆర్డీఓ మధులత తెలిపారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఆర్డీఓ మధులత శుక్రవారం బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఓటు నమోదుపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను బీఎల్‌ఓలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. 18 నుంచి 21 ఏళ్లలోపు యువతీ యవకులు ఎన్నికల ప్రత్యేక క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం సంగం సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ నిర్వహించి పలు రికార్డులను పరిశీలించారు. తహసీల్దారు నాగరాజు, డిప్యూటీ తహసీల్దార్లు ప్రవీణ్‌కుమార్, అశోక్ కుమార్, ఆర్ఐ రాజనారాయణ పాల్గొన్నారు.

నేడు, రేపు ప్రత్యేక క్యాంపులు

సోమశిల: రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అనంతసాగరం మండలంలో శని, ఆదివారాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు సుభాషిణి శుక్రవారం తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బూత్ లెవల్ అధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉంటారని తెలిపారు. నమోదుకు అవసరమైన పత్రాలు తీసుకుని వెళ్లాలని ఆమె తెలిపారు. గ్రామాల్లోని యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.